క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాల పరిశీలన



వెంకటాచలంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి, వెంకటాచలం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పనులను తహసీల్దార్ పి.కృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ, ఇంజినీరింగ్ అధికారులు సూచించాలన్నారు. ప్రభుత్వం అందించే నాణ్యమైన మెటీరియల్, విడుదల చేస్తున్న బిల్లుల గురించి లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. ఆయన వెంట ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వెంకటాచలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 271 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిఉండగా 269 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి ఇద్దరు గాయపడిన ఘటన వెంకటాచలంలో గురువారం చోటుచేసుకుంది. గూడూరు పట్టణానికి చెందిన సతీష్ తన తల్లి లక్ష్మితో కలిసి బైక్‌పై నెల్లూరుకు వెళుతుండగా, వెంకటాచలం సమీపంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో సతీష్, లక్ష్మిలకు గాయాలు కాగా చికిత్సనిమిత్తం వారిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈసీజీ యంత్రం కోసం నగదు వితరణ



చెక్ అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక సీహెచ్‌సీలో ఈసీజీ యంత్రం కొనుగోలుకు దొడ్ల రుక్మిణి చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు దొడ్ల కోదండరామిరెడ్డి రూ.55 వేల చెక్‌ను గురువారం ఆస్పత్రి వైద్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు లక్ష్మి మాట్లాడుతూ దాత దొడ్ల కోదండరామిరెడ్డి ఈసీజీ యంత్రం కొనుగోలుకు చెక్ అందించడం అభినందనీయమన్నారు.

ఉద్దేశపూర్వకంగా అసత్య కథనాలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ ఆలయంపై పచ్చపత్రిక ఉద్దేశపూర్వకంగా అసత్య కథనాలు రాసి ఆలయ ప్రతిష్టను దెబ్బతీస్తోందని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయ ప్రతిష్టతోపాటు దాతల మనోభావాలను దెబ్బతీసేలా పచ్చపత్రికలో ఇష్టానుసారంగా అసత్య కథనాలు రాస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న కిరణ్‌రెడ్డి

మనుబోలు: విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎంఈఓ శేషాద్రివాసు అన్నారు. మండలంలోని మనుబోలు బాలుర, బాలికల, అక్కంపేట, వీరంపల్లి, మడమనూరు, బద్దెవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని 350 మంది 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ముందుగా అక్కంపేట హైస్కూల్‌లో విద్యార్థులు సరస్వతిపూజ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతికి సాయం అందిస్తున్న ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టమూరు అజయ్‌రెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎంలు డేవిడ్, ప్రభాకర్‌రావు, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలకు భరోసా

- అపద్బాంధవుడిలా సేవలందిస్తున్న 108 వాహనాలు
- ఫోన్ కాల్ చేస్తే చాలు నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరిక





కోవూరులో 108 వాహనంలో మహిళ ప్రసవించిన బిడ్డను అందజేస్తున్న సిబ్బంది(ఫైల్)

కోవూరు: అపద సమయాల్లో వైద్యం కోసం ఆస్పత్రులకు చేరుకునేందుకు వాహనాలు దొరక్క ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో ఏర్పాటు చేసిన 108 వాహన వ్యవస్థ నేటికీ సేవలందిస్తూ ప్రజల ప్రాణాలకు భరోసా ఇస్తోంది. గత ప్రభుత్వం 108 వాహన సేవలను ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యం వహించినప్పటికీ అనంతరం వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 108 సేవలకు మళ్లీ జీవం పోసింది. ప్రతి మండలానికి ఒక 108 వాహనం ఉండేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో కోవూరు నియోజకవర్గంలోని 5 మండలాలకు ఒక్కొక్క 108 వాహనాన్ని ప్రభుత్వం అందజేసింది. ఒక ఫోన్ కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలో బాధితుల వద్దకు, ప్రమాదం జరిగిన స్థలానికి ఈ 108 వాహనాలు చేరిపోతున్నాయి. బాధితులకు అవసరమైన ప్రాథమిక వైద్యసేవలను సిబ్బంది 108 వాహనంలోనే అందిస్తూ సమీప ఆస్పత్రులకు తరలిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో క్షతగాత్రులను, కొన ఊపిరితో ఉన్న వారి ప్రాణాలను 108 వాహనాలు కాపాడుతున్నాయి. ఇటీవల కోవూరు మండలం జమ్మిపాళెం గ్రామంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి.

వాహనంలోనే అధునాతన పరికరాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి అందజేసిన 108 వాహనంలోనే క్షతగాత్రులకు, రోగులకు ప్రథమ చికిత్స అందించేందుకు అవసరమైన అధునాతన పరికరాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆక్సిజన్ సిలిండర్, వెంటిలేటర్, సిరంజ్, సిరంజ్ పైపు, ఇన్‌ఫ్యూజన్ పంపు, స్ట్రెచర్, వీల్‌చైర్ అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరాల ద్వారా వాహనంలోని సిబ్బంది క్షతగాత్రులు, రోగులకు ప్రథమచికిత్స అందిస్తూ వైద్యశాలలకు తరలిస్తున్నారు. తద్వారా 108 వాహనాలు ప్రజల ప్రాణాలను కాపాడడంలో విశేష సేవలు అందిస్తున్నాయి.

తక్షణం స్పందించి వెంటనే వైద్యం

జిల్లాలో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకొని వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రమాదం, గుండెపోటు తదితర ఆకస్మిక సమయాల్లో ఎంత వేగంగా ప్రథమచికిత్స అందించి ఆస్పత్రికి తరలిస్తే అంత మంచిది. ఆ విషయంలో 108 వాహనాలు పూర్తిగా విజయవంతమయ్యాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను, గర్భిణులను 108 సిబ్బంది అతివేగంగా ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

– ముత్యాల పవన్‌కుమార్, 108 వాహనాల జిల్లా మేనేజర్

రైతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక కృషి

- ఆర్‌బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలు
- లేగుంటపాడు ఎఫ్‌పీఓకు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు
- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

కోవూరు: రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. మండలంలోని లేగుంటపాడు ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రోసెస్ ఆర్గనైజేషన్)ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న ప్రతి పథకాన్ని రైతులకు చేరువ చేయడంలో ప్రత్యేక చొరవ చూపుతున్నామని తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ఏ సీజన్‌లో ఏ పంటలు పండుతున్నాయో అందుకు అవసరమైన సూచనలు, సలహాలను రైతులకు అందిస్తూ వారికి ఉపయోగపడే విధంగా పుస్తకాలను ముద్రించి అందజేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు విషయంలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ముడిసరుకులు అందుబాటులో ఉండడం వల్ల పరిశ్రమలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఉద్యానవనశాఖ చేపడుతున్న ప్రతి కార్యక్రమం ఎంతో బాగుందన్నారు. జిల్లాలోనే లేగుంటపాడు ఎఫ్‌పీఓకు ప్రత్యేక గుర్తింపు ఉందని, దాని ద్వారా దాదాపు 1500 మంది రైతులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. జిల్లాలో పలు రకాల పండ్లను ఎఫ్‌పీఓల ద్వారా సేకరించి విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో వ్యవసాయశాఖతోపాటు ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఆయన వెంట డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖాధికారి సుబ్బారెడ్డి, ప్రగతి యువ కేంద్రం చైర్మన్ గునపాటి ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ పద్మజ, ప్రగతి యువ కేంద్రం ఎఫ్‌పీఓ సీఈఓ గునపాటి భూపేష్‌రెడ్డి, మారంరెడ్డి వంశీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కోవూరు: డీఎల్‌డీఏ రాష్ట్ర చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ గురువారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావులతో కలిసి రాష్ట్ర రాజధానిలోని శాసనసభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వ సేవలు లబ్ధిదారులకు అందించాలి

- జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్



నార్తురాజుపాళెం సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ కూర్మనాథ్

కొడవలూరు: సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను లబ్ధిదారులకు సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సిబ్బందికి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం, రామన్నపాళెం, ఆలూరుపాడు సచివాలయాలను గురువారం జేసీ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా ? లేదా ? అని పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల ద్వారా అందే సేవలు ప్రజలకు సకాలంలో అందిస్తున్నారా అని ఆరా తీశారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్ల నాటే కార్యక్రమం జరుగుతున్నందున రైతుల సమక్షంలో హద్దు రాళ్ల నాటాలని తెలిపారు. కరోనా నూతన వేరియంట్ ప్రబలుతున్నందున సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాదేవి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్‌కుమార్, జాలయ్య, విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే హద్దు రాళ్ల ఏర్పాటు



రైతులకు సూచనలిస్తున్న డీఎల్‌డీఏ డైరెక్టర్, రెవెన్యూ సిబ్బంది

కొడవలూరు: రైతుల సమక్షంలోనే హద్దు రాళ్ల నాటే కార్యక్రమం జరుగుతున్నందున వారు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఏ డైరెక్టర్ మందపల్లి మల్లికార్జున తెలిపారు. మండలంలోని వెంకన్నపురంలో హద్దు రాళ్ల నాటే కార్యక్రమంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రీసర్వే పూర్తయినందున హద్దు రాళ్ల నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నారని తెలిపారు. రైతులు దగ్గరుండి హద్దు రాళ్ల నాటించుకోవడం వల్ల ఎలాంటి సందేహాలు, వివాదాలకు తావుండదని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో అనూష, సర్వేయర్ ఈదూరు శిల్ప, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం: విద్యార్థులు స్నేహపూరితమైన పోటీతత్వాన్ని అలవరచుకోవాలని ఎంఈఓ దిలీప్ కుమార్ సూచించారు. స్థానిక బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే పాఠశాల నుంచి 9 మంది ఈ ఉపకార వేతనాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి



ఇందుకూరుపేట: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ముత్తుకూరు: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట: స్వతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో వారికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి తదితరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కోర్ కమిటీ సభ్యులు గంపల మంజుల, మేనేజర్ సాయి మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో..

ముత్తుకూరు: భగత్‌సింగ్ గొప్ప దేశభక్తుడని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చెంచురామయ్య కొనియాడారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ ప్రాణాలను అర్పించారని, వీరి పోరాటాలను విద్యార్థులు ఆదర్శం తీసుకోవాలని తెలిపారు.

పంటల నష్టంపై సమీక్ష

పొదలకూరు: వ్యవసాయ, ఉద్యానవన శాఖల మండల అధికారులతో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి గురువారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలో మిరప, పుచ్చ పంటలు నష్టపోయినట్లు తెలిపారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఉద్యానవనశాఖ అధికారి ఈ.ఆనంద్, ఏఓ వాసు, ఏఏబీ చైర్మన్ వై.పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని విస్మరించిన బీజేపీ

పొదలకూరు: ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ బిల్లును 9 ఏళ్ల క్రితమే పార్లమెంటులో ప్రవేశపెడతామని ప్రకటించిన బీజేపీ మాదిగలకు ఇచ్చిన హామీని విస్మరించిందని మహాజన్ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు మందా పెంచలయ్య మాదిగ ఆరోపించారు. మాదిగల మహా సంగ్రామ పాదయాత్రలో భాగంగా గురువారం మండలంలోని కనుపర్తి గ్రామానికి చేరుకున్న నాయకులు మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో కోలగట్ల రమేష్‌మాదిగ, అలుపూరు పాపయ్యమాదిగ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గడప గడపకు..'

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విడవలూరు మండలంలో..

25వ తేదీ రామతీర్థం, 27న పాతూరు, 28న రామలింగాపురం, గౌరీపురం, ఆంజనేయపురం, 31న ఊటుకూరు, ఏప్రిల్ 1, 3వ తేదీల్లో ఊటుకూరు, 12, 13, 14 తేదీల్లో విడవలూరు గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

కోవూరు మండలంలో..

ఏప్రిల్ 4, 5వ తేదీల్లో పడుగుపాడు, 18న కోవూరులోని రామనాథపురం, విఘ్నేశ్వరపురం, చుండుగుంట, 19న తూర్పుఅరుంధతీయవాడ, ఎస్ఎస్ఆర్ కాలనీ, ఎన్‌పీకేఆర్ కాలనీ, 20న పెళ్లకూరు కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి గ్రామంలో మార్చి 29వ తేదీన, ఇందుకూరుపేట మండలంలో ఏప్రిల్ 6, 8, 10, 11 తేదీల్లో కొత్తూరు గ్రామాల్లో, కొడవలూరులో ఏప్రిల్ 15, 17 తేదీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

26న కవి సమ్మేళనం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ఉగాది పురస్కారాల ప్రదానం, జాతీయ స్థాయి కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నామని రచయితల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, అన్నపూర్ణ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో గురువారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పలువురు సాహితీవేత్తలు, కవులు, తదితరులను సత్కరించనున్నామని పేర్కొన్నారు. రత్నప్రసాద్, అరుణకుమారి, నజ్మా, హనోక్, భారతి, శ్రీమన్నారాయణ, నాగరాజారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డిని సన్మానిస్తున్న ముత్యంగౌడ్

ముత్తుకూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చినట్టు జిల్లా అధ్యక్షుడు నడవడి ముత్యంగౌడ్ తెలిపారు. తాడేపల్లిలో గురువారం 26 జిల్లాల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుల సమావేశం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డితో పలు అంశాలపై చర్చించినట్లు ముత్యంగౌడ్ విలేకరులకు తెలిపారు. అన్ని ప్రాజెక్టుల వద్ద ట్రేడ్ యూనియన్ పతాకాలు ఆవిష్కరించాలని నిర్ణయించామన్నారు. కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంకల్పించారన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి



బైక్ మెకానిక్‌కు గుర్తింపు కార్డు అందజేస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. బైక్ మెకానిక్‌లు హెల్మెట్ ధరించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అల్లాభక్షు, బదురుద్దీన్, షబ్బీర్, బషీర్, రూప్‌సింగ్, మహబూబ్‌బాషా, ఖలీల్, యస్దానీ, రహీం, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రైతులు ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసులు

మనుబోలు: రైతులు ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ నెల్లూరు ఏడీఏ ఎన్.శ్రీనివాసులు సూచించారు. మనుబోలులో గురువారం రాత్రి ఐపీఎల్(ఇండియన్ పొటాష్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఎరువులు, పురుగుమందుల వాడకం, నీటి యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోకుంటే ప్రభుత్వం ద్వారా అందే రాయితీలు, నష్టపరిహారాలు, పీఎం కిసాన్ నిధులు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈకేవైసీపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, పైరు పిలకలు వేసే దశలో పొలంలో నీళ్లు ఎక్కువగా పెట్టవద్దని సూచించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కె.కిరణ్‌కుమార్, డి.వినయ్‌కుమార్, ఐపీఎల్ చీఫ్ మేనేజర్ లోగమూర్తి రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్, ఐపీఎల్ సేల్స్ అధికారి వెంకటనారయ్య, కార్యక్రమ నిర్వాహకుడు దామిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారంపై తల్లులు, గర్భిణులకు మరింత అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని కొత్తవంగల్లులో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి వచ్చే నెల 3వ తేదీ జరిగే పోషణ పక్వాడా కార్యక్రమం ద్వారా పోషక విలువలపై అవగాహన పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కేంద్రాల్లో ఇచ్చే వైఎస్సార్ కిట్‌లు, బాలామృతం, గుడ్లు తీసుకొని పోషక విలువలు పెంచుకోవడంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.సుజాత, టి.సుప్రజ, ఎస్.కామేశ్వరి, ఎం.భారతి, కె.కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పద్మనాభసత్రం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరకంబాక రామయ్య, నాయకుడు మల్లు మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.శిరీష, పి.సుమలత, పి.చండీప్రియ, యు.శాంతమ్మ పాల్గొన్నారు.